సాక్షి అనకాపల్లి

శనివారం । 9 । డిసెంబర్ । 2023



కొండంత పండగ

విశాఖలో కొండగుడి పండగ కనువిందుగా జరిగింది. అమలోద్భవిని దర్శించుకోవడానికి భక్తజనం తరలివచ్చింది. 8లో



జలాంతర్గామి దినోత్సవం

విశాఖ: నేవీలో జలాంతర్గామి విభాగం ఏర్పడిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సబ్‌మెరైన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల రెండు రోజులు స్వల్ప వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9న 2, 10న 1 మి.మీ. వర్షపాతం, 28.8 నుంచి 29.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, గాలి గంటకు 8 నుంచి 9 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

సాగరతీరం.. సంభ్రమాశ్చర్యం..!



సంద్రంలో బాంబుల మోత





- నేవీ విన్యాసాలు అదుర్స్
- ఆకట్టుకున్న ఫైనల్ రిహార్సల్స్
- రెప్పవాల్చకుండా చూసిన సందర్శకులు



నేవీ బ్యాండ్ ప్రదర్శన



ఆపద సంకేతం



విన్యాసాలు వీక్షిస్తూ...



సాక్షి, విశాఖపట్నం : సాగర జలాల్లో యుద్ధ నౌకల కవాతు.. గగన తలంలో హెలికాప్టర్ల పహారా.. శత్రు మూకలపై నేవీ కమాండోల కదన కుతూహలం.. రివ్వును దూసుకొచ్చిన మిసైల్స్.. దానితో పోటీ పడేటట్లుగా మెరుపు వేగంతో వెళ్లిన యుద్ధ విమానాలు.. గాల్లో చక్కర్లు కొట్టిన హెలికాప్టర్లు.. మొత్తంగా.. ఆర్‌కే బీచ్.. రణరంగాన్ని తలపించింది. ఒళ్లు గగుర్పొడిచేలా నిర్వహించిన నేవీ విన్యాసాల రిహార్సల్స్.. యుద్ధవాతావరణాన్ని మించిపోయేలా చేసింది. ఉవ్వెత్తున ఎగిసిపడిన జనసంద్రం నడుమ ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని.. నింపిన నౌకాదళ విన్యాసాలతో సాగర తీరం సంభ్రమాశ్చర్యాలకు కేంద్రంగా మారింది. శుక్రవారం నిర్వహించిన తుది రిహార్సల్స్.. గంటన్నర సేపు అలరించాయి. అంతకు ముందు నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నేవీ బ్యాండ్‌తో సెయిలర్స్ అదరగొట్టారు. ఆర్‌కే బీచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన నేవీ తాత్కాలిక కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు విన్యాసాలను పర్యవేక్షించారు. 10న జరిగే నేవీడేకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, హాజరుకానున్నారు.

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేలా..

- అన్నదాతలను ఆదుకోవడమే సీఎం జగన్ లక్ష్యం
- రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధరకు కొనుగోలు
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు
- కలెక్టర్‌తో కలిసి ఎం.అలమండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఎం.అలమండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



వరి పంటను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

దేవరాపల్లి: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించి అన్నదాతను అన్ని విధాలుగా ఆదుకోవడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి మండలం ఎం.అలమండ రైతు భరోసా కేంద్రంలో జిల్లాలోనే ప్రప్రథమంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఏ దశలోనూ రైతులు ఆర్థికంగా నష్టపోకుండా, వారి చెంతకే వెళ్లి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా దళారీ వ్యవస్థతో, మిల్లర్ల చేతిలో, తనిఖీల్లో తేడాలతో రైతు మోసపోకూడదనే ఉద్దేశంతో ఆర్బీకేల ద్వారా కనీస మద్దతు ధరకు తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి కేవలం 15 నుంచి 20 రోజుల వ్యవధిలోనే రైతు ఖాతాలో నగదు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తుపాను ప్రభావంతో తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని, రైతులు అధైర్యపడవద్దని భరోసానిచ్చారు. ఈ క్రాప్ చేసుకోని రైతుల ధాన్యం సైతం కొనుగోలు చేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికార్లను ఆయన ఆదేశించారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ రైతులెవ్వరూ నష్టపోకుండా అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరతో ప్రతి రైతుకు బస్తాకు 300 నుంచి 500 రూపాయల వరకు అదనంగా లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం రైతులకు మినప విత్తనాలను అందజేశారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్ట పోయిన ప్రతి రైతుకు జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎం.అలమండలో నీట మునిగిన, నేలమట్టమైన వరి పంటను, వరి కుప్పలను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నీటి ముంపునకు గురైన వరి చేనుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఉప్పు ద్రావణాన్ని స్వయంగా పిచికారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పంటలకు ఎంత నష్టం వాటిల్లిందనే విషయాలపై అధికార్లతో ఇప్పటికే చర్చించామన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న చిన్న రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 15 వేల ఎకరాలకు పైబడి వరి పంట నీట మునిగిందని, 22 వేల ఎకరాల వరి పంట నేలకు ఒరిగిందని, 180 ఎకరాల మేర ఉద్యాన పంటలు పాడయ్యాయని ప్రాథమిక అంచనాలను సిద్ధం చేశామని, పూర్తి స్థాయి నివేదికలను రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. గ్రామాలలో పారిశుధ్యం పనులు, ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కె.వి.ఎల్.ఎం.మూర్తి, జిల్లా మేనేజర్ జయంతి, జిల్లా కోపరేటివ్ అధికారి కిరణ్‌కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, స్థానిక సర్పంచ్ దాడి జగన్, ఎంపీటీసీ పోతల వెంకటరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ బండారు ప్రసాదరావు, మండల ప్రత్యేక అధికారి వి.రవీంద్రనాథ్, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ఏవో వై.కాంతమ్మ, ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ పాల్గొన్నారు.

రేపు గవర్నర్ రాక



మహారాణిపేట (విశాఖ): గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం విశాఖ వస్తున్నారు. సాయంత్రం ఆర్.కె.బీచ్‌లో జరిగే నేవీ డేలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. నేవీ హౌస్‌లో హై టీ అనంతరం రాత్రి 7.30 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ల నియామకం



పలకా రవి



సూరాకాసుల గోవిందు

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్లుగా పలకా రవి, సూరాకాసుల గోవిందులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామకపు ఉత్తర్వులు శుక్రవారం వెలువడ్డాయి.

రోడ్ల మరమ్మతులకు రూ.77 కోట్లతో ప్రతిపాదనలు



వడ్డాదిలో దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న ఎస్ఈ క్రాంతిమతి



డైవర్షన్ రోడ్డులో జేసీబీతో పనులు చేస్తున్న సిబ్బంది

- ఆర్అండ్‌బి ఎస్ఈ క్రాంతిమతి

బుచ్చెయ్యపేట: తుపాను కారణంగా జిల్లాలో 140 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్టు ఆర్అండ్‌బి ఎస్ఈ క్రాంతిమతి తెలిపారు. వడ్డాదిలో పెద్దేరు నీటిలో మునిగిన డైవర్షన్ రోడ్డు, దెబ్బతిన్న వంతెనను ఆమె అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 38 కల్వర్టులు, 10 రోడ్డు మార్జిన్లు దెబ్బతిన్నాయని చెప్పారు. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.8 కోట్లు, శాశ్వత నిర్మాణ పనులకు రూ.77.39 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో మరమ్మతు పనులు చేపట్టామని, ప్రయాణికుల రాకపోకలకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టామని చెప్పారు.

యుద్ధప్రాతిపదికన డైవర్షన్ రోడ్డుకు మరమ్మతులు

భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎస్) రోడ్డులో రాకపోకలు సాగేలా ప్రయాణికులకు రవాణా సదుపాయం కల్పిస్తామని, యుద్ధప్రాతిపదికన డైవర్షన్ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని ఆర్అండ్‌బీ ఎస్ఈ క్రాంతిమతి తెలిపారు. పాదచారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తక్షణం మరమ్మతులు చేపట్టి శనివారం నుంచే వంతెనపై నుంచి రాకపోకలు సాగేలా చూడాలని అధికారులకు సూచించారు. డైవర్షన్ రోడ్డు ఖానాల్లో ఇరుక్కుపోయిన చెట్లు, తుప్పలను జేసీబీతో ఎస్ఐ కుమారస్వామి, ఆర్అండ్‌బీ డీఈ నాగ మనోహరరావు, జేఈ సాయి శ్రీనివాసులు, ఈవో లవరాజులు దగ్గరుండి తీయించారు. దీంతో వరద నీరు ఖానాల్లో నుంచి వెళ్లడంతో మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఆరోగ్యంపై అప్రమత్తం



తగరంపూడి పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హేమంత్

అనకాపల్లి టౌన్/మునగపాక: తుపాను కారణంగా భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అనారోగ్య పరిస్థితులు నెలకొనకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ అనకాపల్లి మండలంలో తగరంపూడి పీహెచ్‌సీని శుక్రవారం సందర్శించారు. పీహెచ్‌సీలో అన్ని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

అకాల వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశముందని, జ్వర పీడితులకు మంచి వైద్యం అందించాలన్నారు. ఓపీ, ల్యాబ్, మందులు నిల్వ చేసిన గదిని పరిశీలించారు. జిల్లా మలేరియా అధికారి కె.వరహాల దొర మునగపాక మండలం నాగులాపల్లిలో పర్యటించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాగులాపల్లిలో నిల్వనీటిని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వరహాల దొర

అపురూపం.. భారతీయం



వేద పాఠశాలలో ఆశీర్వచనం పొందుతున్న ఆస్ట్రేలియన్ యువతి జార్జిమోర్

- ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి
- ఆస్ట్రేలియా యువతి జార్జి మోర్
- యలమంచిలి వేద పాఠశాలలో పఠనం
- భారతదేశంలో పూరీ నుంచి రామేశ్వరానికి పాదయాత్ర

యలమంచిలి: భారతదేశం సంస్కృతీ, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని ఆస్ట్రేలియన్ యువతి జార్జి మోర్ అన్నారు. జగద్గురు ఆదిశంకరాచార్యుని అద్వైత సిద్ధాంతం, దాని లక్ష్యాల ప్రచారంలో భాగంగా పూరీ నుంచి రామేశ్వరం వరకు పాదయాత్ర చేస్తున్న ఆమె శుక్రవారం యలమంచిలి పట్టణంలోని వేద పాఠశాలను, గోశాలను సందర్శించారు. వేద పాఠశాలలో విద్యార్థులతో కలసి వేదపఠనం చేశారు. మన ప్రాచీన వేదాలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో ఆచార సంప్రదాయాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. అద్వైతం, వేదాలపై మక్కువ పెంచుకుని, దేశమంతటా ప్రచారం చేయనున్నట్లు వెల్లడించారు. భారత దేశ సంస్కృతీ, సంప్రదాయాల గురించి తెలుసుకోవడం ఈ దేశంలోని ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఇక్కడి వేదపండితుల ఆశీర్వచనం పొందడం చాలా ఆనందంగా ఉందని, తను చేస్తున్న పాదయాత్రకు భగవంతుడు గొప్ప శక్తిని ప్రసాదించాడన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు సన్యాసిబాబు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ, పడాల శ్రీరాములు, సమరసత ఫౌండేషన్ సభ్యుడు సత్యనారాయణ, వేదపాఠశాల సెక్రటరీ పెద్దింటి సూర్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించాలి

దొండపర్తి (విశాఖ): రాష్ట్రంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించాలని హోటల్ అసోసియేషన్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చాంబర్స్ ప్రతినిధులు మంత్రిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. విశాఖ పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. దేశంలోని 12 రాష్ట్రాలలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆయా రాష్ట్రాలలో ఈ పాలసీ ఏ విధంగా అమలు జరుగుతుందో తెలుసుకొని వివరాలు అందించాలని సూచించారు. అలాగే విశాఖలో పర్యాటక రంగం చాలా వరకు దెబ్బతిందని, పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిందని వారు మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన భూమి ఇవ్వాలని రెవెన్యూ శాఖను కోరామని చెప్పారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో అమలు జరుగుతున్న లిక్కర్ పాలసీ లైసెన్స్ ఫీజు తగ్గించాలని ప్రతినిధులు కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు ఇచ్చిన సమాచారాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా

రూ.6 కోట్లతో బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లు



మాట్లాడుతున్న సూక్ష్మసాగు నీటి వనరుల పథకం ప్రాజెక్టు డైరెక్టరు లక్ష్మి

నాతవరం: జిల్లాలో రూ.6 కోట్లతో బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లను రాయితీపై రైతులకు అందజేస్తున్నట్టు జిల్లా సూక్ష్మ సాగు నీటి వనరుల ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.లక్ష్మి తెలిపారు. ఆమె మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ముందుగా మండలంలో ప్రధాన సమస్యలపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం బిందు, తుంపర్ల సేద్యాన్ని 1200 హెక్టార్లలో విస్తరించేందుకు లక్ష్యం విధించిందన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవోలు తాడి అమృత్‌కుమార్ కామిరెడ్డి వరహాలబాబు డిప్యూటీ తహసీల్దార్ చైస్లు ఇవోపిఆర్‌డి మూర్తి పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు పాల్గొన్నారు.

పెరిగిన కోనాం జలాశయ నీటిమట్టం

- భారీగా చేరుతున్న ఇన్‌ఫ్లో



జలాశయ గర్భం

చీడికాడ: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలోని కోనాం జలాశయ నీటి మట్టం 5 రోజుల వ్యవధిలో 10 మీటర్లు పెరిగి, శుక్రవారం సాయంత్రానికి 99 మీటర్లకు చేరింది. జలాశయ గరిష్ట నీటిమట్టం 101.25 మీటర్లు. జలాశయంలోకి వస్తున్న ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు ఉండడంతో ఆదివారం నాటికి ప్రమాదకర స్థాయికి నీటి మట్టం చేరే అవకాశం ఉంది. 100 మీటర్లు దాటే వరకు నీటిని నిల్వ చేసి తదనంతర పరిస్థితి ఆధారంగా నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ ఏఈ జయరాం తెలిపారు. ఇదిలా ఉంటే నిన్న మొన్నటి వరకు డెడ్ స్టోరేజీకి దగ్గరగా చేరుతోందనుకున్న జలాశయ నీటి మట్టం, తుపాను వర్షాల ధాటికి పూర్తిస్థాయికి చేరుకోవడంతో రైతుల్లో రబీ ఆశలు చిగురించాయి.

కనువిందుగా కొండగుడి పండగ

- వేడుకగా మేరీమాత ఊరేగింపు
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు
- ముగిసిన ఉత్సవాలు



కొండగుడిపై మేరీమాత ఊరేగింపు

దాబాగార్డెన్స్: క్రీస్తుకు జన్మనిచ్చి, ప్రపంచాన్ని పునీతం చేసిన మేరీమాతను కనులారా చూడాలని, మాత కరుణ కటాక్షాలు తమపై ప్రసరించాలని భక్తులు పరితపించారు. దూరాభారం లెక్క చేయకుండా వేలాదిగా తరలివచ్చారు. గంటల కొద్దీ నిరీక్షించి కొండగుడి ఉత్సవాన్ని కనులారా తిలకించి భక్తి తన్మయత్వంలో మునిగిపోయారు. పాత పోస్టాఫీస్ ప్రాంతంలోని రోస్‌హిల్ కొండపై వెలసిన అమలోద్భవి అమ్మవారిని దర్శించుకోవడానికి అశేష భక్తజనం తరలివచ్చింది. భక్తి పారవశ్యంతో మాతను స్మతిస్తూ.. ఆరాధకుల గీతాలాపనలు.. సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం అగ్ర పీఠాధిపతుల బోధనలు, ఇలా అక్కడ అణువణువునా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణ జిల్లాల నుంచి అమ్మ కరుణ కోసం తరలి వచ్చిన ఆరాధకులతో విశాఖ జనపురిగా మారిపోయింది. కుల, మతాలకు అతీతంగా అమ్మవారిని దర్శించుకోవడంతో పరమత సహనం పరిఢవిల్లింది. గత నెల 29న ప్రారంభమైన మేరీమాత ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పది రోజుల పాటు నవ దిన ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 4.30, 5.15, 6 గంటలకు దేవాలయం వద్ద ఆంగ్లంలో దివ్యపూజ చేశారు. తెలుగులో ఉదయం 5, 6 గంటలకు దివ్య పూజ జరిపారు. పూజలో ఎక్కువ మంది కన్యస్త్రీలు రాష్ట్రం నలుమూలల నుంచి హాజరై ప్రార్థనలు చేశారు. ఉదయం 7.30 గంటలకు గుహవద్ద విశాఖ అగ్రపీఠాధిపతి ఫాదర్ మల్లవరపు ప్రకాష్ సమష్టి దివ్యబలి పూజ ప్రసంగమిచ్చారు. 350 మంది వలంటీర్లు, 50 మంది గురువులతో పాటు నగరంలోని వివిధ చర్చిల ఫాదర్లు ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం పాతపోస్టాఫీస్ వద్ద ఉన్న సెయింట్ అలెయిసిస్ పాఠశాల నుంచి అశేష ఆరాధకులు మేరిమాత స్వరూపంతో ప్రదక్షిణగా కొండపై ఉన్న ప్రధాన దేవాలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. ఆరాధకుల సందర్శనార్థం ఆలయం బయట అమలోద్భవి స్వరూపాన్ని ఉంచారు. ఆరాధకులు అమ్మవారికి తమ శక్తి మేరకు బంగారం, వెండి కానుకలు సమర్పించారు. కొంత మంది తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. లూర్ధుమాత గుహ వద్ద దివ్యపూజ బలితో మహోత్సవం ముగిసింది.



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



శిలువతో ప్రదర్శన నిర్వహిస్తున్న పాస్టర్లు

జోరుగా వ్యాపారం

పాత పోస్టాఫీసు, కోటవీధి, ఫెర్రీరోడ్డు, అంబుసరంగ్ వీధి, కన్వేయర బెల్ట్ తదితర ప్రాంతాల్లో పండగ సందర్భంగా సుమారు కిలోమీటర్ల మేర దుకాణాలు వెలిశాయి. ఆధ్యాత్మిక గ్రంథాలు, కొండగుడి చరిత్ర, ఏసుక్రీస్తు, మేరీమాత బొమ్మలు కొలువుదీరాయి. మిఠాయిలు, శనగలు, ఖర్జూరం వ్యాపారం జోరుగా సాగింది. కొవ్వొత్తుల వ్యాపారం ఎక్కువగా జరిగింది.

సివిల్స్ మెయిన్స్ పాసైన దివ్యాంగుడు

- ప్రస్తుతం టీచర్‌గా పనిచేస్తున్న తిమ్మరాజుపేట యువకుడు
- ఇంటర్వ్యూలోనూ విజయం సాధిస్తానని ధీమా



కర్రి శ్రీను

అచ్యుతాపురం (అనకాపల్లి): విధి చిన్నచూపు చూసినా అకుంఠిత దీక్షతో మొక్కవోని సంకల్పంతో సాధన చేసిన సరస్వతీ పుత్రుడు అత్యున్నత సివిల్స్ పరీక్షలో మెయిన్స్ పాసై ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. ప్రస్తుతం మునగపాక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన కర్రి శ్రీను ఈ ఘనత సొంతం చేసుకున్నారు. గతంలో గ్రూప్ 1కు ఎంపికై ఎంపీడీవో పోస్టు వచ్చినప్పటికీ ఐఏఎస్ సాధించాలన్న తపనతో వదులుకున్నారు. వ్యవసాయదారులైన తల్లిదండ్రులు కర్రి గంగునాయుడు, లక్ష్మి శ్రీనును కష్టపడి చదివించారు. అనకాపల్లిలో డిగ్రీ చదివి, బీఈడీ, ఎమ్మెస్సీ మ్యాథ్స్ దూరవిద్య ద్వారా చదివిన ఆయన 2008లో డీఎస్సీకి ఎంపికయ్యారు. సివిల్స్ లక్ష్యంగా చేసుకొని సాధన చేసిన శ్రీను ఈ ఏడాది మేలో సివిల్స్ ప్రిలిమినరీ, సెప్టెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు రాసి విజయం సాధించారు. ఇంటర్వ్యూలో కూడా నెగ్గుకు వస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఓటు నమోదు తుది గడువు నేడు

తుమ్మపాల: ఓటు హక్కు నమోదుకు నేటితో గడువు ముగుస్తుందని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి డాక్టర్ ఎ.మహేష్ యువతకు పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవడం బాధ్యగా గుర్తించాలన్నారు. సమీపంలోని ఓటరు నమోదు కార్యాలయానికి వెళ్లి ఆధార్, రేషన్ కార్డు, పుట్టిన తేదీని ధ్రువపరిచే సర్టిఫికెట్, పాస్‌ఫొటోలు తీసుకెళ్లి బీఎల్వోల వద్ద పేరును నమోదు చేసుకోవాలన్నారు. voterportal.ece.gov.in వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 8985754583, 8008414743 నంబర్లలో నోడల్ అధికారిని సంప్రదించవచ్చన్నారు.

అధికార్లు నిధులు రాబట్టి అభివృద్ధికి సహకరించండి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ప్రజావేదికలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: మండల అధికారులు జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టే నిధులు పూర్తి స్థాయిలో మండలాలకు రప్పించి అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం బుచ్చెయ్యపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ ప్రజావేదిక సభ జరిగింది. గత ఏడాది ఏప్రిల్ నెల ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు 35 పంచాయతీ గ్రామాల్లో రూ.12.50 కోట్లతో జరిగిన 1,153 పనులపై సోషల్ ఆడిట్ ప్రజా వేదిక జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విప్ ధర్మశ్రీ ఏడాదిలో రూ.పన్నెండున్నర కోట్లతో ఉపాధి పనులు జరగడం వల్ల మండలానికి 40 శాతం కాంపింటివ్ నిధులు కింద సుమారు రూ.5 కోట్లు రావాల్సి ఉందన్నారు. దీంట్లో కోటి రూపాయలు మాత్రమే రాగా మిగిలిన రూ.4 కోట్లు మండలానికి ఎందుకు రాబట్టి వినియోగించలేదని అధికారులను ప్రశ్నించారు. తక్షణం ఆ నిధులు మండలానికి రప్పించి అభివృద్ధి పనులకు వినియోగించాలని ఎంపీడీవో సువర్ణరాజు, ఏపీవో మురళీకి సూచించారు. ఏడాదిలో జరిగిన రూ.12.50 కోట్లు నిధుల్లో కేవలం రూ.15 వేలు మాత్రమే పక్కదారి పట్టినట్టు ప్రజావేదికలో బయట పడింది. ఉపాధి నిధులు పక్కదారి పట్టకుండా ప్రజలకు వినియోగపడేలా చేసిన అధికారులను విప్ ధర్మశ్రీ అభినందించారు. రికవరీకి రాసిన రూ.15 వేలును తిరిగి కట్టించాలని అడిషనల్ పీడీ రోజారాణి మండల అధికారులకు సూచించారు. ఇకపై ఒక్క రూపాయి కూడా పక్కదారి పట్టకుండా గ్రామాల్లో అభివృద్ధికి సహకరించాలని అధికారులకు విప్ ధర్మశ్రీ సూచించారు. 12వ తేదీన వడ్డాదిలో జరిగే ప్రజాసాధికారిక బస్సుయాత్రను ప్రజలంతా వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు, ఏపీడీ శ్రీనివాస్, ఎస్ఆర్పీ రామారావు, విజిలెన్స్ అధికారి దివ్య పాల్గొన్నారు.

పైపులైన్ ప్రాంతంలో చెట్లు వేయడం నిషేధం



తహసీల్దార్‌తో చర్చిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్. బీష్మానందం

నాతవరం: విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వరకు 575 కిలో మీటర్ల పొడవునా ఉన్న హెచ్‌పీసీఎల్ పైపులైన్ పరిసరాల్లో చెట్లు పెంచడం భవన నిర్మాణాలు చేయడం నిషేధమని స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్. బీష్మానందం అన్నారు. ఆయన శుక్రవారం ఎంబీపట్నం సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్ పాయింటును పరిశీలించారు. అక్కడ కొందరు రైతులు హెచ్‌పీసీఎల్ పైపులైను ప్రాంగణంలో పెంచుతున్న చెట్లను చూసి హెచ్చరికలు చేశారు. తర్వాత తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడును కలిసి పైపులైనుపై చట్ట విరుద్ధంగా చెట్లు పెంచిన రైతుల వివరాలు ఆయనకు ఇచ్చారు. పైపులైను సమీపంలో అక్రమ కట్టడాలు చేసిన వివరాలను పోలీసులకు రెవెన్యూ అధికారులకు ఇచ్చి వెంటనే ఖాళీ చేయించాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రాష్ట్రాల పరిధిలో ఏర్పాటు చేసిన హెచ్‌పీసీఎల్ పైపులైను సమీపంలో ఎలాంటి కట్టడాలు, చెట్ల పెంపకం నిషిద్ధమన్నారు. నిషేధ ప్రాంతంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌పీసీఎల్ పైపులైను ద్వారా ఆయిల్, గ్యాస్ శరవేగంగా ప్రవహిస్తుందన్నారు. చెట్ల పెంపకం, అక్రమ కట్టడాల కారణంగా పైపులైన్‌కు ఏమాత్రం నష్టం కలిగినా రెండు రాష్ట్రాల పరిధిలో పెను ప్రమాదం జరుగుతుందన్నారు. ఇప్పటికే కొంతమందిపై పోలీసు స్టేషన్లలో బైండోవర్ కేసులు పెట్టామన్నారు. నర్సీపట్నం ఆర్డీవోకు ఆక్రమణదారులపై ఫిర్యాదు చేశామన్నారు. హెచ్‌పీసీఎల్ పైపులైను ఏర్పాటు చేసే ముందు ప్రభుత్వం రైతుల నుంచి భూములు తీసుకుని నష్ట పరిహారం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయా భూములపై రైతులకు ఎలాంటి హక్కు లేదన్న విషయాన్ని గ్రహించాలన్నారు.

మిషన్ వాత్సల్య ఖాళీల భర్తీకి దరఖాస్తులు

తుమ్మపాల: మహిళా, శిశు సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య పథకంలో ఖాళీగా ఉన్నా 23 పోస్టులకు కాంట్రాక్ట్, పార్ట్ టైం పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.అనంతలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లిలో డీసీపీయూలుగా 10, ఎస్ఏఏలుగా 10 ఖాళీలు, చిన్నపిల్లల కేంద్రం కశింకోటలో రెండు, నర్సీపట్నంలో ఒక ఖాళీ ఉందన్నారు. https://anakapalli.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్లోడ్ చేసుకుని, 12వ తేదీ లోపు పట్టణంలోని నూకాంబిక ఆలయం వద్దనున్న జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

ఆటో డ్రైవర్ దుర్మార్గం

- వృద్ధురాలిపై దాడి చేసి పుస్తెలతాడు అపహరణ
- నిందితుల అరెస్టు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ షేక్ గఫూర్, ఎస్ఐలు సన్నిబాబు, పాపినాయుడు

యలమంచిలి : ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాల్సిన ఆటో డ్రైవర్ దుర్మార్గంగా ప్రవర్తించాడు. వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలో పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. ఈ నెల 2వ తేదీన అనకాపల్లి మండలం నర్సింగరావుపేట, చవితిని వీధికి చెందిన చవితిని చిలకమ్మ (70) రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో ఉన్న తన కుమార్తె మరపురెడ్డి భవానీ ఇంటికి వెళ్లడానికి అనకాపల్లిలో ఆటో ఎక్కింది. ఆటో డ్రైవర్ ప్రయాణికులతో పాటుగా ఆమెను యలమంచిలి పట్టణానికి తీసుకొచ్చాడు. అప్పుడు చిలకమ్మ పంచదార్ల వెళ్లడానికి ఆటోని యలమంచిలిలో నిలపమని డ్రైవర్‌కు చెప్పగా నేను కూడా పంచదార్ల మీదుగా వెళతానని ఆమెను మభ్యపెట్టి ఆటోను పురుషోత్తపురం సమీపంలో ములకలాపల్లి మీదుగా పోలవరం కాలువ వైపు పోనిచ్చాడు. నిర్మానుష్య ప్రాంతానికి చేరాక ఆమెను బెదిరించి ఆమె మెడలో గల మూడు తులాల బంగారు గొలుసు, రెండు తులాల తాడును లాక్కొని ఆమె తలపై రాయితో కొట్టి ఉడాయించాడు. దీంతో ఆమె సంఘటన స్థలంలో స్పృహ తప్పి పడిపోయింది. కొంత సమయానికి కొత్తలి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆమెను గమనించి ఆటోలో యలమంచిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. వృద్ధురాలిపై దాడికి పాల్పడ్డ ఆటోడ్రైవర్ యలమంచిలిలో ఒక మందుల దుకాణం వద్ద ఆటోను నిలిపి మందులు కొనడానికి షాపు దగ్గరకు వెళ్లగా అక్కడ ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా గుర్తించి విచారణ చేశారు. కొక్కిరాపల్లి సమీపంలో గురువారం ఆటోలను తనిఖీ చేస్తుండగా అనకాపల్లి బీఆర్‌టీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఎర్రబోయిన రెడ్డప్ప అలియాస్ శేఖర్‌గా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చేసిన నేరాన్ని అంగీకరించడంతో అతనితో పాటు మరో ఆటో డ్రైవర్ భరిన్కాల గంగరాజు పాత్ర ఉండడంతో వారి వద్ద నుంచి బంగారం అమ్మిన నగదు, ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ శుక్రవారం విలేకరులకు తెలిపారు.

పథకం ప్రకారమే చోరీ

కాగా అనకాపల్లిలో ఆటో ఎక్కడానికి వచ్చిన వృద్ధురాలు చవితిన చిలుకమ్మ మెడలో బంగారంపై కన్నేసిన నిందితులు పథకం ప్రకారమే ఆమెను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారని పోలీసులు తెలిపారు. రెడ్డప్ప వృద్ధురాలి నుంచి దొంగిలించిన బంగారాన్ని స్నేహితుడు గంగరాజుకు ఇవ్వగా, గంగరాజు దానిని విక్రయించి వచ్చిన నగదు పంచుకుందామనుకున్నారు. క్రికెట్ బెట్టింగ్‌లు ఇతర అలవాట్లకు బానిసైన గంగరాజు అప్పుల పాలై రెడ్డప్పను డబ్బు అడిగాడు. స్నేహితుడు అడిగిన డబ్బు ఇవ్వడానికే ఈ దొంగతనం చేయాల్సి వచ్చిందని రెడ్డప్ప విచారణలో ఒప్పుకున్నట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. అన్నమయ్య జిల్లాకు చెందిన ఎర్రబోయిన రెడ్డప్ప అలియాస్ శేఖర్ అనకాపల్లి వలస వచ్చి కొంతకాలంగా భార్యతో కలిసి బీఆర్‌టీ కాలనీలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. ఇటువంటి ఘటనల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఆటోల్లో ప్రయాణించేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ సూచించారు.

రోడ్డుప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ



స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేసి సిబ్బందితోమాట్లాడుతున్న ఎస్పీ

- పోలీసు సిబ్బందికి ఎస్పీ మురళీకృష్ణ సూచన

నక్కపల్లి: క్రైమ్ రేట్ తగ్గింపు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మురళీ కృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయం, స్థానిక పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణ్‌రావులు ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్టేషన్లలో రికార్డులు, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల గురించి ఆరా తీశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జాతీయరహదారిపై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు పోలీసు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. చైన్ స్నాచింగ్‌లు, చోరీలు, దొంగతనాలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అనుమానాస్పదంగా తిరిగేవారిని గుర్తించాలని, జూదరులు, అసాంఘిక శక్తులు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపట్ల కూడా నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణ్‌రావు, యలమంచిలి ట్రాఫిక్‌ఎస్ఐ ఈశ్వరరావు పాల్గొన్నారు. అడ్డురోడ్డులో ఉన్న నక్కపల్లి సర్కిల్ కార్యాలయంలో కూడా ఎస్పీ తనిఖీ నిర్వహించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వారి పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఐ అప్పన్న, ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

జిల్లాలో స్కూళ్ల అభివృద్ధికి రూ.7 కోట్లు

- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీవైఈవో అప్పలరాజు

నాతవరం: జిల్లాలోని పాఠశాలల్ని మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేసిందని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. మండలంలోని డి.ఎర్రవరం హైస్కూల్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దేశ ప్రముఖులు గాంధీజీ, అంబేడ్కర్, సీవీ రామన్, అబ్దుల్ కలాం విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యా బోధన, మధ్యాహ్న భోజనం అమలు, తదితర అంశాలపై ఆరా తీశఋరు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాఠశాలలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేయగా మిగిలిన పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఈ నెల 22లోపు ఆయా పాఠశాలల్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, విద్యాశాఖ రాష్ట్ర ఐటీ విభాగం కోఆర్డినేటర్ సీహెచ్ రమేష్, హెచ్ఎం ఆకుల కుమారి, పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు డి.గోపీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూలిన పెంకుటిల్లు పైకప్పు



కూలిన పైకప్పును చూపిస్తున్న బాధితుడు సత్యారావు

అచ్యుతాపురం(అనకాపల్లి): మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తడిసి ముద్దయి శిథిల భవనాలు నేలకూలుతున్నాయి. అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురం గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి సత్యారావుకు చెందిన పెంకుటింటి పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని సత్యారావు కోరారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ ప్రకటన రద్దు

తుమ్మపాల/కశింకోట: మండలంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎస్టీలకు రిజర్వ్ చేసిన ఆయా పోస్టులకు అభ్యర్థులు లభ్యం కాకపోవడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఓపెన్ కేటగిరిలో భర్తీ చేయడానికి ఇచ్చిన ప్రకటనను రద్దు చేసినట్లు ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి శుక్రవారం తెలిపారు. ఈ పోస్టుల భర్తీపై అభ్యంతరాలతో ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని పేరంటాలపాలెం, గోకివానిపాలెం కేంద్రాల ఆయా పోస్టులు, అనకాపల్లి మండలంలో ఐదు ఆయా పోస్టులను ఎస్టీ కేటగిరి అభ్యర్థులు చాలా కాలంగా లభ్యం కాకపోవడంతో ఓపెన్ కేటగిరిలో భర్తీకి గత నెల 23న ప్రకటన ఇచ్చినట్లు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యాక ఈ పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామన్నారు.

క్లుప్తంగా

అంబలం పూజ నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి రామాలయం కేబుల్ టీవీ కూడలి వద్ద పంబాపీఠం ఆధ్వర్యంలో శనివారం భారీ అంబలం పూజ నిర్వహించనున్నట్లు గురుస్వాములు పల్లా గోపాలకృష్ణ, ఒమ్మి రాము, బుదిరెడ్డి మురళీకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప, శివ స్వాములు, భవానీ, ఇతర భక్తులు హాజరు కావాల్సిందిగా కోరారు.

అలరించిన కోలాటం

అనకాపల్లిటౌన్: శివ భక్తి గేయాలు పాడుతూ కోలాటం ఆడటం విశేషమని భోగలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆలయ ఆవరణలో శ్రీ పెదరామ కళా తరంగిణి కోలాట బృందం, పెదరామస్వామి దేవాలయం, శ్రీసంపత్ వినాయక, చినసంపతిపురం శ్రీరామ సత్యదేవ, కొత్తూరు కళాశాల జంక్షన్‌కు చెందిన కోలాట బృందాలు ఆడిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అంతకుముందు బృందాలు ఆళ్ల నాగేశ్వరరావు, పెంటకోట ధనలక్ష్మిలను ఘనంగా సత్కరించాయి. అర్చకులు పేరూరి చిన్నిస్వామి, పేరూరి సాత్వికశర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ధర్మకర్తలు కొణతాల కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, కాండ్రేగుల రాము, కొణతాల త్రినాథరావు, మెలిపాక ఈశ్వరరావు, సంగంపల్లి నాగరాజు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న రవికుమార్

అనకాపల్లిటౌన్: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేసుకోవచ్చని మలేరియా అధికారి రవికుమార్ అన్నారు. పట్టణంలోని 82వ వార్డులో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లపై చెత్త వేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొని, వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి గణేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కశింకోట: మండలంలోని పంచాయతీల వారీగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీవీ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 23 వరకు జరిగే యాత్రలో మొదటి రోజు బుచ్చియ్యపేట, కొత్తపల్లి పంచాయతీల్లో యాత్ర కొనసాగుతుందన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఏపీటీఎఫ్ అర్బన్ కార్యవర్గం ఎన్నిక

అనకాపల్లిటౌన్: ఏపీటీఎఫ్ అనకాపల్లి(అర్బన్) అధ్యక్షుడిగా జె.డేవిడ్‌రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా వై.సూర్యారావు, గౌరవాధ్యక్షుడిగా వై.సత్యం, ఉపాధ్యక్షుడిగా బలిరెడ్డి శ్రీనివాసరావు, ఆడిట్‌సభ్యులుగా కె.దేవి నిరోషాతో పాటు మరో 5గురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. పరిశీలకులుగా యూనియన్ రాష్ట్ర నాయకులు కాండ్రేగుల దుర్గాప్రసాద్, సీహెచ్ మహాలక్ష్మిలు వ్యవహరించారు.

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–9 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్–16 యూనిట్లు, ఏబీ పాజిటివ్–4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 424 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.


నవశకం
ప్రగతి సంతకం

పేదల బతుకుల్లో ఆరోగ్య సిరులు





ఈమె పేరు నారపిన్ని నూకాలమ్మ. అక్కిరెడ్డిపాలెం ఈమె ఊరు. భర్త గతేడాది మరణించారు. ప్రస్తుతం కొడుకు వద్ద ఉంటున్నారు. మూడేళ్లుగా ఆయాసం, హైబీపీతో బాగా ఇబ్బంది పడ్డారు. చాలా ఆస్పత్రులకు తిరిగినా.. ఫలితం కనిపించలేదు. వైజాగ్‌లోని అను ఆస్పత్రిలో కొన్నాళ్లు వైద్యం అందించారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయకుంటే ప్రాణానికే ప్రమాదమని తేల్చిచెప్పారు. అంత ఖర్చు పెట్టే స్థోమత లేక కొన్నాళ్లు ఇంట్లో మంచానికే పరిమితమయ్యారు. ఆపరేషన్ తప్పనిసరి కావడంతో, స్థానిక సచివాలయ సిబ్బంది, కుటుంబ సభ్యుల సహకారంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో రిజిస్టర్ చేసుకున్నారు. గతంలో చికిత్స అందించిన ఆస్పత్రిలోనే ఈ ఏడాది జనవరిలో ఆపరేషన్ చేశారు. ఓపెన్ హార్ట్ సర్జరీ, ఇతర ఖర్చులకు సుమారు రూ.2 లక్షలు అయింది. 10 రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉచితంగా వైద్యసేవలు అందించారు. ఇంటికి వచ్చేటపుడు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.10 వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ఆపరేషన్ అనంతరం తన ఆరోగ్యం చాలా బాగుందని, ఇపుడు ఎలాంటి ఆయాసం లేదని, పూర్తి ఆరోగ్యంగా అన్ని పనులూ చేసుకోగలుగుతున్నట్లు నూకాలమ్మ ఆనందం వ్యక్తం చేసింది. తనకు పునర్జన్మనిచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలని దీవించింది.



నా పేరు గొర్లి గోవింద. మాది గోపాలపురం. నాకు భార్య, ఇద్దరు పిల్లలు. రోజూ పనికి వెళ్తేగానీ పూట గడవని బతుకు. పరవాడ ఫార్మాసిటీలో ప్రైవేటు వర్కర్‌ని. రెండేళ్లుగా నడుము నొప్పి విపరీతంగా వేధిస్తోంది. ఆస్పత్రిలో చూపిస్తే ఆపరేషన్ చేయాలని, రూ.లక్షకు పైగా ఖర్చు అవుతుందన్నారు. అంత సొమ్ము ఎక్కడి నుంచి తెచ్చేదని భయపడ్డా. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేస్తారని తెలిసి దరఖాస్తు చేసుకున్నా. విశాఖలోని ఎంబీ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో బెడ్‌రెస్ట్‌లో ఉన్నా. ఆపరేషన్‌కు రూ.80 వేలు ఖర్చయిందని, ఆ మొత్తం ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వమే భరించిందని సిబ్బంది తెలిపారు. త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామన్నారు. సీఎం జగన్‌కు మా కుటుంబమంతా రుణపడి ఉంటుంది.

ఆరోగ్యశ్రీ అమలు ఇలా..

మూత్రపిండాలు, గుండె, మెదడు, కాలిన గాయాలు, క్యాన్సర్, ప్రమాదకర కేసులను ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధులు ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. గతంలో ఆరోగ్యశ్రీ పథకం కింద 1059 రోగాలకు సేవలు అందిస్తుండగా.. ఆ సంఖ్యను 2,434కు పెంచుతున్నట్లు సీఎం జగన్ గతంలోనే ప్రకటించారు. 30 విభాగాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి పెద్ద పెద్ద నగరాల్లో కూడా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పించారు. క్యాష్ లెస్ ట్రీట్మెంట్ పొందొచ్చు. వైద్య ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది.

చాలా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడానికి ప్రధాన కారణం అనారోగ్యం. తమ వారిని కాపాడుకునేందుకు సర్వం అమ్ముకున్న వాళ్లు కోకొల్లలు. అనారోగ్యం కారణంగా ఏ ఒక్కరి ఆర్థిక పరిస్థితి పతనం కారాదని దివంగత మహానేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేస్తూ, పేదల జీవితాల్లో ఆరోగ్య సిరులు కురిపిస్తున్నారు.

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పెరిగిన ధీమా
- 30 విభాగాల్లో 2,434 రోగాలకు పథకం వర్తింపు

తుమ్మపాల: సీఎం జగన్ ప్రభుత్వం పేదలకు ఎన్నో రకాల పథకాలు అందిస్తోంది. వీటిల్లో ఆరోగ్యశ్రీ అత్యంత ప్రతిష్టాత్మకమైన పథకం. దివంగత మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన బృహత్తర పథకం ఆరోగ్యశ్రీ. ఈ పథకాన్ని 2007 నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేస్తున్నారు. ఈ స్కీమ్ పరిధిని మరింత పెంచారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రపంచంలోనే అత్యున్నత ఆరోగ్య బీమా పథకంగా గుర్తింపు దక్కించుకుంది.

చికిత్స అనంతరం కూడా..

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం అనంతరం కూడా ప్రభుత్వం రోగులకు సేవలందిస్తోంది. చికిత్స తర్వాత రవాణా చార్జీలిస్తుంది. ఆస్పత్రిలో ఉన్న రోజుల్లో భోజనం వసతి సదుపాయాలు ఉచితమే. రోగి కోలుకునే వ్యవధిలో ఆర్థిక ఆసరాగా వ్యాధి మేరకు డిశ్చార్జి అయిన వారం పది రోజుల్లోనే రూ.20 వేలు వరకు రోగి పేర్కొన్న బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తోంది.

కిడ్నీలో రాళ్లతో బాధపడ్డా



నా వయసు 55 ఏళ్లు. కిడ్నీలో రాళ్లు ఏర్పడటంతో ఏడాదిగా బాధపడుతున్నా. విపరీతమైన కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు పట్టణలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి, కిడ్నీలో రాళ్లున్నాయన్నారు. ఆపరేషన్ తప్పనిసరన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని మా వలంటీర్ ద్వారా తెలిసింది. వెంటనే ఆరోగ్యశ్రీ సిబ్బందిని సంప్రదించి నా సమస్యను చెప్పుకున్నా. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.30 వేలు ఖర్చయ్యే ఆపరేషన్ ఉచితంగా చేశారు. ఇప్పుడు నా అనారోగ్య సమస్య సమసిపోయింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– జెర్రిపోతుల చిన్నోడు, గోపాలపురం

త్వరితగతిన పంట నష్టపరిహారం


వెంకుపాలెంలో నీట మునిగిన వరిపంటను పరిశీలిస్తున్న గొర్లి సూరిబాబు, ఏడీ రామారావు

తుమ్మపాల: మండలంలోని వెంకుపాలెంలో నీటి ముంపునకు గురైన పంట పొలాలను ఎంపీపీ గొర్లి సూరిబాబు, వ్యవసాయ శాఖ ఏడీ రామారావులు శుక్రవారం పరిశీలించారు. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్ట పరిహారాన్ని రెండు రోజుల్లో రైతులకు అందించాలని అధికారులను ఆదేశించారు. రైతులెవరూ అధైర్య పడవద్దన్నారు. వెంకుపాలెం నుంచి కుంచంగి వెళ్లే రహదారిని అనుకుని ఉన్న వరిపొలాల్లో రైతులతో మాట్లాడారు. మండలంలో తుపాను ప్రభావంతో జరిగిన నష్టాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపెట్టి నాగేశ్వరరావు, ఎంపీటీసీ వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మొల్లి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం రేపు

అనకాపల్లిటౌన్: మండలంలోని మామిడిపాలెం హైస్కూల్లో ఆదివారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆత్మీయ విద్యార్థి సేన సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంకు సహకారంతో నిర్వహించనున్న ఈ శిబిరంలో యువత పాల్గొని రక్తదానం చేయాల్సిందిగా కోరారు.

తుపాను బాధిత రైతుల్ని ఆదుకోవాలి


మునిగిపోయిన పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నేత సత్యనారాయణమూర్తి

తుమ్మపాల: తుపాను కారణంగా నష్టపోయిన రైతుల పొలాలను పాలకులు, అధికారులు తక్షణమే పరిశీలించి, సరైన నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని తుమ్మపాల, బవులువాడ గ్రామాల్లో ఆయనతో పాటు సీపీఐ బృందం శుక్రవారం పర్యటించింది. పంట చేతికి వచ్చే సమయంలో తుపాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టాన్ని అంచనా వేసి త్వరితగతిన సాయం అందించాలన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, రూరల్ నాయకులు చెల్లూరు నాగరాజు, దేవుడుబాబు, నరాలశెట్టి సత్యనారాయణ, వియ్యపు రాజు, వేముల కన్నబాబు, పప్పల ఈశ్వరరావు, వియ్యపు రమణ పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో గ్రామాల అభివృద్ధి


శంకరం సచివాలయంలో సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు


వెదురుపర్తిలో అభివృద్ధి, సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

అనకాపల్లిటౌన్: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని మన రాష్ట్రంలో స్థాపించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి అన్నారు. మండలంలోని శంకరం సచివాలయం పరిధిలో గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు అందించిన రూ.23 కోట్ల అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అనంతరం శంకరం గ్రామం ప్రధాన కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడే పల్లెనిద్ర చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.గోవింద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరిపల్లి శోభ, భట్లపూడి సర్పంచ్ గొంతిన షాజావతి, శంకరం ఉపసర్పంచ్ గుడాల తాతబాబు, ఎంపీటీసీలు మంత్రి సంతోషం, ముమ్మిన అప్పలనాయుడు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ నొట్ల శేఖర్, పార్టీ నేతలు పసుపులేటి రామకృష్ణ, గొంతిన సత్యారావు, సచివాలయం కన్వీనర్ పసుపులేటి సన్యాసిరావు, నొట్ల శ్రీనివాస్, పచ్చికూర కళావతి, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కశింకోట: వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధికి నోచుకున్నాయని, ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని వెదురుపర్తి సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ పరిధిలో సిమెంట్ రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.20 లక్షల నిధులను సీఎం సమకూర్చారని, దీంతో గ్రామాల సత్వర అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సచివాలయ మండల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పడమటమ్మ ఆలయ నిర్మాణానికి రత్నాకర్ విరాళం


శ్రీ పడమటమ్మ తల్లిని దర్శించుకున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: తమ్మయ్యపేటలోని పడమటమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. మండలంలోని సంపతిపురం శివారు తమ్మయ్యపేట గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రాథమిక పాఠశాలలో తన సొంత నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై అధికారులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రం గదుల్లో ఫ్యాన్లు లేకపోవడంతో రెండు ఫ్యాన్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పాము మణికంఠకు నెలకు రూ.3 వేలు, ప్రమాదంలో కాళ్లు చేతులు విరిగిన దాకారపు అప్పారావుకు రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తానన్నారు. అనంతరం పడమటమ్మను దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు నంబారు రమణ, నంబారు శ్రీను, ఉరుకూటి గోవింద, బొడ్డపాటి చినరాజారావు, యింటి త్రినాథ్, ఒమ్మ శ్రీను, నందవరపు కుమార్, సాలాపు నాగేంద్రబాబు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న అయ్యప్ప భక్తులు


అమ్మవారి పాటలు పాడుతున్న అయ్యప్పస్వాములు, కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీ రైతుసంఘం ఆశ్రమ అయ్యప్పస్వాముల దీక్ష ముగింపురోజున నూకాంబిక అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అన్నారు. ఆశ్రమ అయ్యప్పస్వాములు 41 రోజుల మండల దీక్ష ముగించుకుని శబరిమలకు బయల్దేరుతున్న సందర్భంగా అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మాణపనులు రూ.10 కోట్లతో శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఆలయ నిర్మాణంలో దాడి జయవీర్ సహాయ సహకారాలను కొనియాడారు. భక్తులు విరాళాలు అందించి ఈ మహాయజ్ఞంలో పాలుపంచుకోవాలని కోరారు. ఆశ్రమ నిర్వాహకులు కొణతాల పూర్ణచంద్రరావు ఆలయ ధర్మకర్తల మండలికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు అయ్యప్పస్వాములు అమ్మవారిని స్తుతిస్తూ భక్తి పాటలు ఆలపించారు.

పంట నష్టం చెల్లింపునకు సత్వర చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

తుమ్మపాల: తుపాను ప్రభావంతో రైతులు నష్టపోయిన పంటలపై తక్షణ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి రంగాచారి ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులకు భరోసా కల్పించాలన్నారు. వ్యవసాయ మండలి చైర్మన్ మొల్లి అప్పారావు, ఏడీ రామారావు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

దిబ్బవీధి నృసింహుని ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ


ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధి శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామికి వెండి కవచం, లక్ష్మీ ఆండాళ్ అమ్మవారికి వెండి చీర అలంకరణ మహోత్సవం ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు రామచంద్రరావు శుక్రవారం తెలిపారు. స్థానిక లక్ష్మీనారాయణనగర్ డీవీఆర్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ చేతుల మీదుగా ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, ఆలయ కమిటీ సభ్యులు దొడ్డి సత్యనారాయణ, దాడి రాము, సూరిశెట్టి జగన్నాథరవి, దార్ల శ్రీనివాసరావు, వి.రాజేంద్ర, శిలపరశెట్టి బాబీ, బొడ్డపాటి చిన రాజారావు, ఇంటి త్రినాథ్ పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి సన్నిధిలో రత్నాకర్

స్థానిక సుంకరమెట్ట సత్యనారాయణస్వామిని దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. రత్నాకర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ కె.ఎం.నాయుడు, కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో జగన్నాథస్వామి ఆలయ చైర్మన్ దాడి ఈశ్వరరావు, యల్లపు శ్రీనివాసరావు, ఆలయ డైరెక్టర్ మారిశెట్టి శ్రీను, కోరిబిల్లి ఆరుద్ర, వేగి పవన్‌కుమార్, ఆడారి రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం


భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న గొల్లవిల్లి

కశింకోట: స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల(దివ్యాంగుల) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి విభిన్న ప్రతిభావంతులు కృషి చేయాలన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన సభలో వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు బహుమతులను అందించారు. సత్యసాయి ట్రస్టు తరఫున భోజన వితరణ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు బి.వి.రమణ, దీప, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సత్యవతి, ఉపాధ్యాయుడు రామునాయుడు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వ సాయం

కశింకోట: మండలంలోని 13 మంది మానసిక దివ్యాంగులకు రూ.1.36 లక్షల విలువ చేసే ఎంఆర్ కిట్లను ఎస్ఐఈపీడీ ద్వారా అందించినట్లు స్థానిక భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు ఎం.వి.రమణమ్మ శుక్రవారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వివిధ రూపాల్లో దివ్యాంగులకు అందించిన సహాయాన్ని వివరించారు. 9, 10 తరగతుల విద్యార్థులు 15 మందికి జాతీయ స్కాలర్‌షిప్‌గా రూ.2 లక్షలు, 30 మందికి ఏపీ సమగ్ర శిక్ష ద్వారా ఎస్కార్ట్ అలవెన్స్ రూపంలో రూ.90 వేలు, 20 మందికి రవాణా అలవెన్స్‌లు రూ.60 వేలు, ఇంటికే పరిమితమైన 10 మందికి దివ్యాంగుల అలవెన్స్ కింద రూ.27 వేలు, ముగ్గురికి రీడర్ అలవెన్స్ రూ.6 వేలు, 40 మంది బాలికలకు ఉపకార వేతనంగా రూ.80 వేలు తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు.

వేడుకగా గౌరీపరమేశ్వరుల కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న దంపతులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం శ్రీ వినాయక గౌరీ సేవాసమితి పీలా గౌరీపరమేశ్వరుల మహోత్సవంలో భాగంగా కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా శుక్రవారం గౌరీపరమేశ్వరుల కల్యాణాన్ని ఆలయ అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్, శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరాహనూకరాజు, అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి బి.లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల శూలాల మహోత్సవం నేడు


గౌరీపరమేశ్వరులు

అనకాపల్లిటౌన్: స్థానిక లక్ష్మీదేవిపేట గౌరీపరమేశ్వరుల శూలాల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి ముప్పన రామలింగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అమ్మవారి దర్శనానికి భారీగా తరలి వచ్చే భక్తుల కోసం బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉత్సవంలో భాగంగా నేలవేషాలు, బాణసంచా వెలుగులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

- స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద శనివారం రాత్రి శూలాల మహోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. దేశెట్టి వెంకట బాబ్జీ, ముప్పన లింగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరగనుందన్నారు. శూలాల మహోత్సవానికి భారీ విద్యుద్దీపాలంకరణ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.